శంషాబాద్ ఎయిర్‌కార్గోకు గోల్డెన్ అవార్డు

శంషాబాద్ రూరల్, డిసెంబర్ 3: హైదరాబాద్ విమానాశ్రయానికి మరో అవార్డు వరించింది. శంషాబాద్ ఎయిర్‌కార్గోకు 'టైం క్రిటికల్ లాజిస్టిక్స్ సొల్యూషన్ ప్రొవైడర్ ఆఫ్ ది ఈయర్ విభాగంలో ప్రతిష్ఠాత్మక గోల్డెన్ అవార్డు లభించింది. చెన్నైలో జరిగిన 5వ సౌత్ ఈస్ట్ ఎయిర్‌కార్గో కాంక్లేవ్ అండ్ అవార్డు-2024లో ఈ అవార్డును కంపెనీ ప్రతినిధులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్ సీఈవో ప్రదీప్ పణికర్ మాట్లాడుతూ.. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ప్రపంచ స్థాయి లాజిస్టిక్స్ పరిష్కారాలను అందించడంలో నిబద్ధతను పాటించడం వల్లనే ఈ అవార్డులు లభిస్తున్నాయన్నారు. ఈ అవార్డు రాకతో సంస్థపై అంతర్జాతీయ కస్టమర్లకు నమ్మకం పెరిగిందని, అలాగే మెరుగైన మౌళిక సదుపాయాలు కల్పించడానికి నిధులు వెచ్చించనున్నట్లు చెప్పారు.

మూడోరోజూ లాభాల్లోనే..

ముంబై, డిసెంబర్ 3: దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు లాభాల్లో ముగిశాయి. బ్లూచిప్ సంస్థలైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లకు మదుపరుల నుంచి లభించిన మద్దతుకు తోడు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో సూచీలు కదంతొక్కాయి. ఇంట్రాడేలో 700 పాయింట్లకు పైగా లాభపడిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 597.67 పాయింట్లు అందుకొని 80,845.75 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 181.10 పాయింట్లు అందుకొని 24,457.15 వద్ద నిలిచింది. అదానీ గ్రూపు షేర్లు క్రమంగా కోలుకుంటున్నాయి. స్టాక్ మార్కెట్లో లిస్టైన 11 సంస్థల్లో ఏడు కంపెనీలు లాభాల్లో ముగిశాయి. వీటితోపాటు ఎయిర్‌టెల్, ఐటీసీ, సన్‌ఫార్మా, ఏషియన్ పెయింట్స్, కొటక్ మహీంద్రాలు నష్టపోయాయి.

జీఎస్టీలో 35 శాతం శ్లాబ్!

త్వరలో పరిచయం చేసే దిశగా మోదీ సర్కారు అడుగులు

సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు, శీతల పానీయాలు, గ్యాంబ్లింగ్‌పై విధించే అవకాశం • 21న జీఎస్టీ కౌన్సిల్‌లో నిర్ణయం

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) శ్లాబుల్లో కొత్తగా మరొకటి రాబోతున్నదా? ఇప్పుడున్న 5, 12, 18, 28 శాతం శ్లాబులకుతోడు ప్రత్యేకంగా గరిష్ఠ శ్రేణిలో మరో శ్లాబు ఉండబోతున్నదా? అంటే.. అవుననే సమాధానాలే కేంద్ర ప్రభుత్వ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. జీఎస్టీ రేటు హేతుబద్ధీకరణపై ఏర్పాటైన మంత్రుల బృందం.. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు, వివిధ రకాల శీతల పానీయాలు, గ్యాంబ్లింగ్‌పై 35 శాతం పన్ను వేయాలని ప్రతిపాదించింది మరి. ప్రస్తుతం ఇవన్నీ 28 శాతంలోనే ఉన్నాయి. ఇక సెస్సుతో కలిపితే పన్ను పోటు 57 శాతానికి చేరుతుండటం గమనార్హం. బీహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని మంత్రుల బృందం ప్రతిపాదిత జీఎస్టీ రేట్ల సర్దుబాట్లపై తాజాగా సమావేశమైంది. ఈ క్రమంలోనే ఆరోగ్యానికి హానికరమైన, సమాజాన్ని పెడదోవ పట్టించేవాటిపై (సిన్ గూడ్స్) పన్నులను పెంచాలన్న నిర్ణయానికి సభ్యులు వచ్చారు.

21న నిర్ణయం?

కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ నాయకత్వంలో ఈ నెల 21న జరుగబోయే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రుల బృందం చేసిన ఈ సిఫార్సులు చర్చకు రానున్నాయి. ఆపై తుది నిర్ణయం తీసుకునే వీలున్నది. అయితే పన్ను వసూళ్లను పెంచడంలో భాగంగానే ఆయా వస్తూత్పత్తులపై ఈ ట్యాక్స్ రేట్ల సర్దుబాట్లు అని సమాచారం. దీంతో ఖజానాను నింపుకోవడానికి భవిష్యత్తులో మరిన్ని వస్తూత్పత్తులను ఈ హై రేంజ్ కేటగిరీలోకే మోదీ సర్కారు తెస్తుందా? అన్న అనుమానాలూ తలెత్తుతున్నాయి.

పన్ను రేట్ల సర్దుబాట్లు

దుస్తులు, మరికొన్నింటిపైనున్న జీఎస్టీ మార్పులపైనా ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఈ క్రమంలోనే విలువనుబట్టి రూ.1,500దాకా 5 శాతం, రూ.1,500-10,000 మధ్య 18 శాతం, రూ.10,000పైన 28 శాతం పన్నులు వేయాలని మంత్రుల బృందం నిర్ణయానికొచ్చినట్టు తెలుస్తున్నది. మొత్తం 148 వస్తూత్పత్తులు, సేవలపై ప్రస్తుతం పడుతున్న పన్ను రేట్లను సవరించాలని మంత్రుల బృందం ప్రతిపాదించింది. ఇప్పుడు అత్యధిక వస్తూత్పత్తులు, సేవలు 18 శాతం శ్లాబులోనే ఉన్న సంగతి విదితమే.

ఇదీ విధానం..

జీఎస్టీ విధానంలో నిత్యావసరాలకు పన్ను మినహాయింపు (0 శాతం) లేదా కనిష్ఠ శ్లాబు 5 శాతం పన్ను పడుతున్నది. అయితే లగ్జరీ, ఆరోగ్యానికి హాని కలిగించే, సమాజంపై చెడు ప్రభావం చూపే వాటిపై గరిష్ఠంగా 28 శాతం పన్ను ఉన్నది. వీటిలో ఖరీదైన కార్లు, మోటర్‌సైకిళ్లు, ఏసీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్లు వంటి కన్జ్యూమర్ డ్యూరబుల్స్, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు, కొన్ని రకాల శీతల పానీయాలు, గ్యాంబ్లింగ్, క్యాసినోలు, లాటరీ తదితర ఆన్‌లైన్ గేమ్స్ ఉన్నాయి. ఈ 28 శాతం పన్నుకుతోడు అదనంగా 22 శాతం సెస్సు కూడా ఉంటుంది. ఇక ప్రత్యేకంగా ముడి వజ్రాలు, రత్నాలపై పావు శాతం, బంగారంపై 3 శాతం జీఎస్టీ ఉన్నది. 2017 జూలై 1న జీఎస్టీని దేశవ్యాప్తంగా అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. వివిధ కేంద్ర, రాష్ట్ర పన్నులను కలిపి ఒకే దేశం, ఒకే పన్ను లక్ష్యంతో జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం పరిచయం చేసింది. ఇందుకుగాను ఆదాయాన్ని నష్టపోతున్న రాష్ర్టాలకు పన్ను వసూళ్లలో వాటాలనూ ఇస్తున్నది.

రికార్డుస్థాయిలో ఎన్‌ఎండీసీ ఉత్పత్తి

హైదరాబాద్, డిసెంబర్ 3: ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌ఎండీసీ రికార్డుస్థాయిలో ఉత్పత్తిని సాధించింది. నవంబర్ నెలకుగాను 4.51 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేసింది. క్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తైన 3.83 మిలియన్ టన్నులతో పోలిస్తే 18 శాతం అధికమైనట్లు కంపెనీ వెల్లడించింది. అలాగే కంపెనీ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన 5.5 శాతం ఎగబాకి 4 మిలియన్ టన్నులకు చేరుకున్నట్లు కంపెనీ డైరెక్టర్(ఫైనాన్స్) అమితవ ముఖర్జీ తెలిపారు.

అప్రిలియా ఆర్ఎస్ 457 ధర పెంపు

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: స్పోర్ట్స్ బైక్ అప్రిలియా ఆర్ఎస్ 457 ధరను రూ.10 వేలు పెంచుతున్నట్లు పియాజియో వెహికల్ సంస్థ ప్రకటించింది. పెరిగిన ధరలు జనవరి నుంచి అమలులోకి రానున్నట్లు పేర్కొంది. ఇటాలియన్ పియాజియో గ్రూపునకు చెందిన బ్రాండే అప్రిలియా. ప్రస్తుతం ఈ స్పోర్ట్స్ బైకు రూ.4.2 లక్షల ప్రారంభ ధరతో లభిస్తున్నది.

ఆఫీస్ స్పేస్‌లో రీట్స్‌దే హవా

526 మిలియన్ చదరపు అడుగులు సొంతం

విలువ రూ.4.5 లక్షల కోట్లు: వెస్టియన్ తాజా నివేదిక

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లకు చెందిన ఆఫీస్ స్పేస్ 526 మిలియన్ చదరపు అడుగులుగా ఉన్నదని ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ మంగళవారం తెలిపింది. 'రీట్స్: రీషేపింగ్ ఇండియాస్ కమర్షియల్ స్పేస్' పేరిట విడుదల చేసిన నివేదికలో ఈ మేరకు వెల్లడించింది. ఈ స్టాక్ విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లుగా ప్రకటించింది. హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై, బెంగళూరు, చెన్నై, పుణె, కోల్‌కతా నగరాల్లో మొత్తం 884.1 మిలియన్ చదరపు అడుగుల గ్రేడ్-ఏ కార్యాలయ స్థలాలున్నాయని వెస్టియన్ డాటా చెప్తున్నది. ఇందులో రీట్స్‌కు చెందినదే 526.3 మిలియన్ చదరపు అడుగులని, దీని విలువ రూ.4.5 లక్షల కోట్లు అని స్పష్టం చేసింది. దీనిలో స్టాక్ మార్కెట్లలో నమోదైన రీట్స్‌ల్లో మూడింటికి చెందినదే 110.7 మిలియన్ చదరపు అడుగులుగా ఉందని వివరించింది.

హైదరాబాద్ టాప్

ఆయా నగరాలపరంగా చూస్తే.. హైదరాబాద్‌లోని మొత్తం ఆఫీస్ స్పేస్‌లో దాదాపు 74 శాతం రీట్స్ ఆధ్వర్యంలోని ఆఫీస్ స్పేసే కావడం గమనార్హం. అలాగే ముంబై, పుణెల్లో గల ఆఫీస్ స్పేస్‌లో రీట్స్‌కు చెందినదే 50 శాతం. అయితే ఈ విషయంలో 24 శాతంతో కోల్‌కతా ఆఖర్లో ఉన్నట్టు వెస్టియన్ తెలియజేసింది. ఇక ఈ ఏడు ప్రధాన నగరాల్లో రీట్స్‌కున్న ఆఫీస్ స్పేస్‌లో 60 శాతానికిపైగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ-ఎస్‌సీఆర్‌లలోనే ఉన్నది. ఇదిలావుంటే భారతీయ రీట్ సంస్థల్లో 4 మాత్రమే స్టాక్ మార్కెట్లలో నమోదయ్యాయని, వీటి ఆధ్వర్యంలో అటు రిటైల్, ఇటు ఆఫీస్ మార్కెట్లలోని స్పేస్ 125 మిలియన్ చదరపు అడుగులని వెస్టియన్ ఈ సందర్భంగా తెలిపింది.



- 2014లో రీట్స్ మొదలు.
- 2019లో స్టాక్ మార్కెట్లలోకి.
- ప్రస్తుతం 4 రీట్స్ ట్రేడ్ అవుతుండగా, వాటిలో బ్రూక్‌ఫీల్డ్ ఇండియా రియల్ ఎస్టేట్ ట్రస్ట్, ఎంబసీ ఆఫీస్ పార్క్స్ రీట్, మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్, నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్ ఉన్నాయి.
- నెక్సస్ సెలెక్ట్ ట్రస్ట్‌కు రియల్ ఎస్టేట్ అసెట్స్ మాత్రమే ఉన్నాయి.

SUMADHURA FOUNDATION OF HAPPINESS

సుమధుర గ్రూపు లగ్జరీ ప్రాజెక్ట్

హైదరాబాద్,డిసెంబర్ 3: దక్షిణాదికి చెందిన ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సుమధుర గ్రూపు..తాజాగా హైదరాబాద్‌లో లగ్జరీ ప్రాజెక్టు పలైస్ రాయల్‌ను అభివృద్ధి చేస్తున్నది. ఈ విలాసవంతమైన ప్రాజెక్టు ద్వారా రూ.2,500 కోట్ల ఆదాయం సమకూరవచ్చునని తెలిపింది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్‌కు సమీపంలో నిర్మించతలపెట్టిన పలైస్ రాయల్ ప్రాజెక్టును 7.35 ఎకరాల స్థలంలో ఏర్పాటు చేస్తున్నది. మూడు విభాగాల్లో నిర్మిస్తున్న ఈ 52 అంతస్తుల ఎత్తైన టవర్‌లో 4 లేదా 5 పడక గదులు కలిగిన 523 యూనిట్లను నెలకొల్పుతున్నది. ప్రస్తుతం నిర్మాణాలు ప్రారంభించిన ఈ ప్రాజెక్టును 2029 నాటికి అందుబాటులోకి తీసుకురానున్నట్లు సుమధుర గ్రూపు సీఎండీ మధుసూధన్ తెలిపారు.

17 కోట్లకు విమాన ప్రయాణికులు!

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో చేరుకునే అవకాశం: ఇక్రా అంచనా

న్యూఢిల్లీ, డిసెంబర్ 3: దేశీయంగా విమానాలు ఎక్కేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 7 శాతం నుంచి 10 శాతం వృద్ధితో 16.4 కోట్ల నుంచి 17 కోట్లకు చేరుకునే అవకాశం ఉన్నదని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది. అలాగే విమానయాన సంస్థల నష్టాలు కూడా రూ.2-3 వేల కోట్ల స్థాయిలో ఉంటాయని వెల్లడించింది. 2024-25 ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో విమాన ప్రయాణికులు 5.3 శాతం ఎగబాకి 7.93 కోట్లకు చేరుకున్నారు. అలాగే అంతర్జాతీయ ప్రయాణికులు 16.2 శాతం చొప్పున అధికమయ్యారు.

ఆశాజనకం విమాన రంగం

దేశీయ విమానయాన రంగంపై ఇక్రా ఆశాజనక వృద్ధిరేటును ప్రకటించింది. దేశీయ, అంతర్జాతీయ ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండటంతో వచ్చే ఏడాది ఈ రంగం నిలకడైన వృద్ధిని నమోదు చేసుకోనున్నదని పేర్కొంది. ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కింజల్ షా మాట్లాడుతూ..ప్రస్తుత, వచ్చే ఆర్థిక సంవత్సరాల్లో విమానయాన రంగం రూ.2 వేల కోట్ల నుంచి రూ.3 వేల కోట్ల స్థాయిలో నష్టాలను నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అధిక ఇంధన ధరలతో ఇబ్బందులు పడిన విమానయాన సంస్థలు గడిచిన రెండేండ్లగా ధరలు తగ్గడంతో లాభాలు మెరుగుపరుచుకుంటున్నాయని, మరోవైపు నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడానికి అధికప్రాధాన్యతనిస్తున్నాయన్నారు. ఈ ఏడాది తొలి ఎనిమిది నెలల్లో కిలో లీటర్ విమాన ఇంధన ధరలు 6.8 శాతం తగ్గి రూ.96,192గా నమోదయ్యాయి. మొత్తం నిర్వహణ ఖర్చుల్లో ఇంధనకోసం పెట్టే ఖర్చు 30 శాతం నుంచి 40 శాతంగా ఉంటుండగా, మరో నిర్వహణ ఖర్చులు 35-50 శాతం స్థాయిలో ఉంటున్నాయని తెలిపింది. వీటిలో విమానాల నిర్వహణ, చమురు, ఇంజిన్ మెంటనెన్స్ కూడా ఉన్నాయి.

పోటీలను ప్రారంభిస్తున్న రవీందర్‌రెడ్డి

ఆత్మస్థైర్యానికి జూడో క్రీడ దోహదం

పోచమ్మమైదాన్, డిసెంబర్ 3: ఆత్మస్థైర్యానికి జూడో క్రీడ ఎంతో దోహదం చేస్తుందని చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ చైర్మన్ బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పాఠశాల క్రీడల జూడో రాష్ట్రస్థాయి పోటీలు పోచమ్మమైదాన్‌లోని కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. జూడో సమాఖ్య కోశాధికారి బైరబోయిన కైలాష్ యాదవ్, కార్యదర్శి సత్యనారాయణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐలయ్య, ఫిజికల్ డైరెక్టర్ మల్లయ్య, రామయ్య, అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుపాకి సంతోష్‌కుమార్, సీనియర్ జూడో కోచ్ వీరస్వామి, కోచ్‌లు పాల్గొన్నారు. గెలుపొందిన వారు ఈ నెల 12 నుంచి 16 వరకు పంజాబ్‌లోని లూధియానాలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

'ప్రజాభవన్ ముట్టడిని జయప్రదం చేయాలి'

గీసుగొండ, డిసెంబర్ 3: చలో ప్రజాభవన్ ముట్టడిని విజయవంతం చేయాలని గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా మల్లయ్య పిలుపునిచ్చారు. గంగదేవిపల్లిలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం యాదవులకు గొర్రెలకు బదులు నగదు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9న చలో ప్రజాభవన్ ముట్టడికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం నాయకులు చల్లా కొమురయ్య, లింగం, మల్లేశ్, కొమారి, రాములు, రాజు, కుమార్, రాజు, జక్కుల రాజు, కుమారస్వామి, సతీశ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు కృషి : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నర్సంపేట, డిసెంబర్ 3: సంక్షేమ పథకాల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. నర్సంపేట మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మికులను సన్మానించారు. వైద్య శిబిరంలో పరీక్షలు చేసి మందులు అందించారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుంటి రజినీకిషన్, కమిషనర్ జోనా, మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్, కౌన్సిలర్లు సాంబయ్యగౌడ్, రాజేందర్, విజయకుమార్, పీ లక్ష్మి పాల్గొన్నారు.

కారు ఢీకొని ప్రైవేటు టీచర్ మృతి

గీసుగొండ, డిసెంబర్3: కారు ఢీకొని ప్రైవేట్ టీచర్ మృతి చెందగా, ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన విశ్వనాథపురం శివారులో వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగింది. సీఐ మహేందర్ కథనం ప్రకారం.. చెన్నారావుపేటలోని సిద్ధార్థ హైస్కూల్‌లో టీచర్లుగా పని చేస్తున్న కృష్ణమోహన్ (పాత ముగ్దుంపురం), జగదీశ్ (నర్సంపేట) హనుమకొండలోని డీఈవో కార్యాలయానికి బైక్‌పై వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో నర్సంపేట నుంచి వరంగల్‌కు వెళ్తున్న కారు వేగంగా ఎదురుగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలవగా, ఎంజీఎం దవాఖానకు తరలించారు. వారిలో జగదీశ్ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ తెలిపారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

వరంగల్‌చౌరస్తా, డిసెంబర్ 3: యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా సూచించారు. మంగళవారం కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంకుమార్‌రెడ్డి అధ్యక్షతన వైద్య విద్యార్థులకు ఏర్పాటు చేసిన యాంటీ ర్యాగింగ్, యాంటీ నార్కోటిక్స్, పోష్ యాక్ట్, సైబర్ క్రైం అవగాహన కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో జరుగుతున్న ఘటనలను దృష్టిలో ఉంచుకొని చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం నాశనం అవుతుందన్నారు. సైబర్ క్రైమ్‌ను నివారించడంలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. నార్కోటిక్ డీఎస్పీ సైదులు మాట్లాడుతూ మత్తు రహిత సమాజాన్ని నిర్మించేందుకు వైద్యుల సహకారం చాలా అవసరమన్నారు. అనంతరం డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ పాల్గొన్నారు.

బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి దారుణహత్య

- కారులో ఉన్న మృతదేహం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీస్ అధికారులు

కారులో ఉన్న మృతదేహం

మట్టెవాడ, డిసెంబర్ 3: బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి దారుణహత్య కలకలం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగంపేట పాత ఏకశిలా హోటల్ గల్లీలో కారు పార్కింగ్ చేసి ఉంది. మంగళవారం ఉదయం కారులో డెడ్‌బాడీ ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మట్టెవాడ సీఐ టీ గోపి ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి చూడగా చిత్రహింసలతో అతికిరాతకంగా హత్య చేసినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. మృతుడు హనుమకొండ జిల్లా శ్రీనివాసకాలనీకి చెందిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి ఎలిగేటి రాజమోహన్ (65)గా గుర్తించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు. అతడి భార్య నాలుగేళ్ల క్రితం మృతి చెందింది. దీంతో రాజమోహన్ ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఘటనా స్థలాన్ని డీసీపీ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గిర్మాజీపేట, డిసెంబర్ 3: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడిన ఘటన హంటర్‌రోడ్‌లోని సంతోషిమాతగుడి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వస్తూ హంటర్‌రోడ్‌లోని సంతోషిమాత గుడి వద్ద యూటర్న్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. దీంతో ఇద్దరిని అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా, ఉమేశ్(20) మరణించినట్లు సమాచారం.

'విద్యుత్ అధికారులను సస్పెండ్ చేయాలి'

నర్సంపేటరూరల్, డిసెంబర్ 3: నర్సంపేట మండలం లక్నేపల్లి 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈ, ఏడీఈ, డీఈని వెంటనే సస్పెండ్ చేయాలని లంబాడ హక్కుల పోరాట సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతాధికారుల తప్పిదం వల్లే సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్ గ్రేడ్-1 ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సంగెం మండలం పల్లారుగూడకు చెందిన గుగులోత్ కృష్ణ మృతి చెందాడని ఆరోపించారు. అధికారుల ఒత్తిడి వల్లే అతడు సబ్‌స్టేషన్‌లో పెయింటింగ్ పనులు చేస్తూ విద్యుదాఘాతానికి గురై దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వాంకుడోత్ వీరన్న, గోపీసింగ్, శ్రావణ్‌నాయక్, జవహర్, రాజునాయక్, భాస్కర్, రమేశ్, శ్రీను, ఈర్య ఉన్నారు.

'రికార్డుల నిర్వహణలో అలసత్వం వద్దు'

వర్ధన్నపేట, డిసెంబర్ 3: గ్రామైక్య సంఘాల సహాయకులు వీవో రికార్డుల నిర్వహణలో అలసత్వం వహించొద్దని సెర్ప్ సీబీవో ఆడిటర్ వెంకట్, ఏపీఎం వేణు అన్నారు. మండల సమాఖ్య భవనంలో గ్రామైక్య సంఘాల వీవోలకు రికార్డుల నిర్వహణపై మంగళవారం అవగాహన కల్పించారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన అంతర్గత ఆడిట్‌ను జిల్లావ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పోచమ్మమైదాన్, డిసెంబర్ 3: వరంగల్ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సత్యశారద మంగళవారం తనిఖీ చేశారు. భవనాన్ని పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. కార్యాలయం శుభ్రంగా ఉండాలని, ప్రజల వాహనాలను క్రమపద్ధతిలో పార్కింగ్ చేయించాలని సూచించారు. భవనానికి మరమ్మతులు చేయించాలన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ఎండీ ఇక్బాల్, డీటీ సుమన్, ఏఎస్‌వో వెంకన్న, ఆర్‌ఐ కృష్ణమూర్తి ఉన్నారు.

'కార్యదర్శుల సమస్యలు పరిష్కరించాలి'

ఖిలావరంగల్: కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్, కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుగులోత్ యాకూబ్‌నాయక్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ సత్యశారదను కలిసి వినతిపత్రం అందజేశారు. 15 నెలలుగా పెండింగ్‌లో ఉన్న చెక్కులను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా ప్రధాన కార్యదర్శి గాజె వేణుగోపాల్, కోశాధికారి పాలకుర్తి సదానందం, కార్యదర్శుల సంఘం జిల్లా కార్యదర్శి దయ్యాల సదానందం, అసోసియేట్ అధ్యక్షుడు కల్లెపు సదానందం, నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఏసీపీ వారోత్సవాల్లో భాగంగా రూపొందించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే టోల్‌ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని సూచించారు.

ఏఆర్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు

ఖిలావరంగల్, డిసెంబర్ 3: ఆస్తిని తన పేరున రాయాలని పెంచుకున్న తల్లిని వేధిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్‌పై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మిల్స్‌కాలనీ సీఐ జే వెంకటరత్నం కథనం ప్రకారం.. రంగశాయిపేటకు చెందిన అరకట్ల పుష్ప భర్త ఏఆర్‌హెడ్ కానిస్టేబుల్‌గా రిటైర్డ్ అయిన తర్వాత గుండెపోటుతో మృతి చెందాడు. అయితే, దత్త పుత్రుడైన రాజేశ్ ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. తన పేరున ఆస్తి రాయాలని, లేకుంటే చంపేస్తానని వేధిస్తున్నట్లు పుష్ప ఫిర్యాదు చేసింది. దీంతో రాజేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. అలాగే, పెరికవాడకు చెందిన తండ్రీకొడుకులు దిడ్డి నరేందర్, దిడ్డి నాగరాజు సాకరాశికుంటలో ఆకారపు శశిధర్ స్థలాన్ని కబ్జా చేశారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో పారిశ్రామికవేత్త మృతి

పోచమ్మమైదాన్, డిసెంబర్ 3: గుండెపోటుతో పారిశ్రామికవేత్త, మహాలక్ష్మి స్టీల్స్ అధినేత, అఖిల భారత పద్మశాలీసంఘం నాయకుడు కూచన కన్నయ్య(57) వరంగల్ బ్యాంకు కాలనీలోని శాంతినగర్‌లో మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఆడెపు రవీందర్, కో ఆర్డినేటర్ వడ్నాల నరేందర్, జిల్లా కార్యదర్శి గోరంటల రాజు, చిప్ప వెంకటేశ్వర్లు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

రమ్య(ఫైల్)

సంగెం, డిసెంబర్ 3: అదనపు కట్నం తీసుకురావాలని భర్త వేధింపులు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. నెక్కొండ మండలం అప్పల్‌రావ్‌పేటకు చెందిన బీరం మల్లేశం కూతురు రమ్య(22)ను సంగెం మండలం తీగరాజుపల్లికి చెందిన జుర్రు ప్రశాంత్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. వివాహ సమయంలో కట్నంగా 20 గుంటల భూమి, రూ. 50 వేల నగదు, 4 తులాల బంగారం ఇచ్చి పెళ్లి జరిపించారు. ప్రస్తుతం వీరికి కుమారుడు ఉన్నాడు. పెళ్లి సమయంలో బిజినెస్ చేస్తున్నానని చెప్పిన ప్రశాంత్ ప్రస్తుతం అప్పులు ఉన్నట్లు చెబుతున్నాడు. దీంతో అదనపు కట్నం తీసుకురావాలని రమ్యను మానసికంగా వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని పలుమార్లు దివ్య తన తండ్రికి ఫోన్‌లో చెప్పింది. ఇక భర్త వేధింపులు ఎక్కువ కావడంతో తట్టుకోలేక ఈ నెల 1న రమ్య ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి మల్లేశం పోలీసులకు జుర్రు ప్రశాంత్‌పై ఫిర్యాదు చేశాడు. మామునూరు ఏసీపీ తిరుపతి, తహసీల్దార్ రాజ్‌కుమార్ ఎంజీఎం పోస్టు మార్టం వద్ద మృతదేహాన్ని పరిశీలించారు. రమ్య తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎల్.నరేశ్ తెలిపారు.

వ్యవసాయ బావిలో దూకి ఒకరి ఆత్మహత్య

కరీమాబాద్, నవంబర్ 3: వ్యవసాయ బావిలో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన నక్కలపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మామునూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని నక్కలపల్లికి చెందిన మన్నె కొమ్మాలు(82) మంగళవారం బహిర్భూమికి వెళ్తున్నట్లు చెప్పి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య కారణాలతో ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దీపం అంటుకొని ఇల్లు దగ్ధం

సంగెం, డిసెంబర్ 3: ఇంట్లో ఉన్న చీరెలకు దీపం అంటుకుని ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలో మంగళవారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. ఎల్గూర్‌రంగంపేట గ్రామానికి చెందిన ఇమ్మడి అఖిల్ భార్య ఇంట్లో దేవుడికి దీపం వెలిగించి బయటకు వెళ్లింది. పిల్లి ఇంట్లోకి వచ్చి దీపాన్ని పడేయడంతో బట్టలకు మంటలు అంటుకున్నాయి. వెంటనే ఇల్లంతా వ్యాపించాయి. దీంతో ఇంట్లోని వస్తువులు, సర్టిఫికెట్లు కాలిపోయాయి. బాధితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. దాతలు సాయం చేయాలని కోరుతున్నారు.

కొడుకులకు భారమైన తల్లి

- గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వదిలివెళ్లిన వైనం
- పోలీసుల కౌన్సెలింగ్‌తో ఇంటికి తీసుకెళ్లిన కుమారులు

వర్ధన్నపేట, డిసెంబర్ 3: వృద్ధాప్యంలో ఉన్న తల్లిని కుమారులు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వదిలి వెళ్లిన ఘటన ఇల్లందలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన దోమకొండ రాధమ్మ(90)కు ముగ్గురు కుమారులు. వృద్ధాప్యంలో ఉన్న ఆమె ఆలనాపాలనా చూసుకోవాల్సిన కుమారులు కనికరం లేకుండా తల్లిని జీపీ వద్ద ఉదయం వదిలి వెళ్లిపోయారు. రోదిస్తున్న రాధమ్మను చూసిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై చందర్ సిబ్బందితో కలిసి వచ్చి వృద్ధురాలి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే కుమారులను గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులను పట్టించుకోని కుమారులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, గ్రామస్తులు రాధమ్మ కుమారులపై ఆగ్రహం వ్యక్తం చేసి ఇంటికి చేర్చారు.

వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు